క్లుప్తంగా

పకడ్బందీగా ఓటర్ సర్వే నిర్వహించాలి



చొప్పకట్లపాలెంలో ఓటర్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేణుమాధవ్

బోనకల్: ఓటర్ జాబితా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ వేణుమాధవ్ సూచించారు. మండలంలోని ముష్టికుంట్ల, చొప్పకట్ల పాలెం, చిరునోముల, రావినూతల, సీతానగరం, జానకీపురం గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ జాబితా సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్వోలు విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీను, కిరణ్, అశోక్, అర్జున్ పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



రశ్మితను సన్మానిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన గండికోట రశ్మిత జాతీయ స్థాయిలో 52వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పట్టణంలోని పాత సెంటర్ ప్రాథమిక పాఠశాలతో పాటు నవచైతన్య సంస్థ ఆధ్వర్యాన శాంతినికేతన్ స్కూల్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్.సుభాషిణి, హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్, డాక్టర్ రమాకాంత్, డాక్టర్ వసుమతీదేవి, డాక్టర్ దాసరి దివాకర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎస్.రాజేశ్వరరావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, అమరవరపు విజయ నిర్మల, గాదిరెడ్డి సబ్బారెడ్డి, డాక్టర్ కొనకళ్ల సుధారాణి, సాయిరాం, ఆడమ్స్, పురుషోత్తం, నర్సింహారెడ్డి, తోట కిరణ్, శ్రీనివాసరావు, పుల్లారావు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలి

కొణిజర్ల: ప్రజా సంఘాల నేతలపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వైరా డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసిం అన్నారు. శుక్రవారం కొణిజర్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ దర్యాప్తు సంస్థ పౌర హక్కుల నేత హరగోపాల్, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, అరుణోదయ నాయకులు విమల, పద్మజ తదితర 150 మందిపై దేశ ద్రోహం కేసులు పెట్టి అరెస్ట్ చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గపు చర్యలను మేధావులు, యువత వ్యతిరేకించాలన్నారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలను పునఃప్రారంభించినట్లు పోస్టల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కొత్తగా ఆధార్‌పేరు నమోదుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, సవరణలు, పేరు, చిరునామా మార్పులకు రూ.50లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశం సత్తుపల్లి తపాలాశాఖ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఇరువురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని పాతర్లపాడుకు చెందిన భార్యాభర్తలు మాతంగి మైసయ్య, ప్రకాశమ్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యవసాయ భూమి విషయంలో మాతంగి వెంకటేశ్వర్లు, ఆయన అన్న మైసయ్య మధ్య ఘర్షణ జరగగా, ఈనెల 11న వెంకటేశ్వర్లుపై మైసయ్య, ఆయన భార్య ప్రకాశమ్మ దాడి చేశారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు.

19న ఆలయ భూములకు వేలం

కల్లూరు: కల్లూరులోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన కల్లూరులోని 14.11 ఎకరాల భూమిని కౌలు కోసం వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు దేవాలయంలో వేలంపాట నిర్వహిస్తారని తెలిపారు. 13 ఎకరాల తరి భూమికి రూ.60 వేలు, 1.11 ఎకరం బీడు భూమికి రూ.2 వేలు డిపాజిట్ కట్టి వేలంపాటలో పాల్గొనాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ 8179536850ను సంప్రదించాలని కోరారు.

అధిక ఫీజులను అరికట్టాలి

ముదిగొండ: ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పానుకుల సుధాకర్ అన్నారు. ముదిగొండలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పుస్తకాలు, ఫీజులు అని భారీగా వసూళ్లు చేస్తున్న సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

'నిఘా' కరువాయె..!

పని చేయని సీసీ కెమెరాలు

- భారీ వాహనాలు తగిలి తెగిన కేబుల్ వైర్లు
- అలంకార ప్రాయంగా మారిన వైనం
- కష్టంగా మారిన నిందితుల గుర్తింపు
- పట్టించుకోని పోలీసులు



బస్టాండ్‌లో పనిచేయని సీసీ కెమెరా



రింగ్‌సెంటర్‌లో..

సత్తుపల్లిటౌన్: నేరాల నియంత్రణలో కీలకమైన సీసీ కెమెరాలు కొన్నాళ్లుగా పనిచేయడం లేదు. మూడేళ్ల క్రితం స్థానిక ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పోలీసులు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ విభాగం పూర్తిగా నిలిచిపోయింది. సత్తుపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చెరుకులోడు, భారీ వాహనాలు కేబుల్ వైర్లకు తాకడంతో అవి పనిచేయడం లేదు. మరికొన్ని వాతావరణ పరిస్థితుల వల్ల దెబ్బతిన్నాయి. దీంతో పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం నిలిచిపోయింది. వీటిని మరమ్మతులు చేయకపోవడంతో అవి అలంకార ప్రాయంగా మారాయి.

నలువైపులా నిఘా ఉన్నా..

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో నేను సైతం కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి పట్టణంలో నలువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వెంగళరావునగర్, తామరచెరువు, అయ్యగారిపేట, రింగ్‌సెంటర్, బస్టాండ్ ఇన్‌గేట్, అవుట్ గేట్, బస్టాండ్ ప్రాంగణంలో, వేంసూరురోడ్, ఎన్టీఆర్‌నగర్, సిద్ధారంరోడ్, మసీద్‌రోడ్, కాకర్లపల్లి రోడ్, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో సుమారు 40 వరకు సీసీ కెమెరాలు అమర్చారు.

సంఘటనలు జరిగినప్పుడు..

దొంగతనాలు, సిగ్నల్ క్రాసింగ్, రోడ్డు ప్రమాదాలు వంటి సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు పసిగట్టేందుకు ఎంతగానో సహకరించేవి. ప్రస్తుతం ఇవి పనిచేయకపోవడంతో నిందితులను గుర్తించడంలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పట్టణంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే సమయంలో జేబు దొంగలు తమ చేతివాటం చూపుతున్నారు. ఈ క్రమంలో వీరిని గుర్తించాలంటే కష్టంగా మారింది. ఇప్పటికైనా సీసీ కెమెరాలను మరమ్మతులు చేయించడంతో పాటు పర్యవేక్షణ మరింత పెంచాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

పునఃరుద్ధరించేందుకు చర్యలు..



సత్తుపల్లి పట్టణ పరిధిలో సీసీ కెమెరాలను పూర్తి స్థాయిలో పునఃరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంకా సాంకేతికంగా నైపుణ్యం కలిగిన సీసీ కెమెరాలు, సోలార్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. సీసీ కెమెరాలను ఇంకా విస్తరించి పకడ్బందీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– టి.కరుణాకర్, సీఐ, సత్తుపల్లి

కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి

- పట్టణ ప్రగతి దినోత్సవంలో ఎమ్మెల్యే రాములునాయక్,
- జెండా ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ జైపాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్, అధికారులు

వైరా: కేసీఆర్ పాలనను తెలంగాణ ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గం వైరాలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రాములునాయక్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో పట్టణ ప్రగతి రెండింతలు అయ్యిందని కేసీఆర్ పట్టణ ప్రగతికి నిధులు కేటాయించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బందిని సత్కరించారు.

మున్సిపల్ కార్యాలయంలో..

ఉత్సవాల్లో భాగంగా స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది..



మీనవోలులో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరా: కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ అన్నారు. స్థానిక మండల కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం కొండకొడిమ గ్రామానికి చెందిన సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకుడు ఆళ్ల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకుడు పుల్లారావు నేతృత్వంలో పలు పార్టీల వారు కాంగ్రెస్ లో చేరగా దుర్గాప్రసాద్ ఆహ్వానించి మాట్లాడారు. ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాలోత్ రాందాస్ నాయక్, ఎల్‌డీఎం కోఆర్డినేటర్ రమేష్, పట్టణ, మండల అధ్యక్షులు సీతారాములు, వెంకటనర్సిరెడ్డి, దానియేలు, హరినాథ్, అశోక్, వీరభద్రం, గోపాలరావు, గంగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం..

ఎర్రుపాలెం: కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పీసీసీ సభ్యుడు శీలం ప్రతాపరెడ్డి, మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మీనవోలు గ్రామంలో పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలతో కలిసి కరపత్రాలతో ప్రచారం చేశారు. సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ, నాయకులు నర్సింహారావు, కృష్ణారావు, జానీబీషా, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, వెంకటనర్సయ్య, బోసు, జమలయ్య, రోశయ్య, బాబురావు, ఆనందరావు, వెంకట్రామిరెడ్డి, సుబాని, వెంకటరత్నం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వాటర్ బాటిళ్లు పంపిణీ



పెనుబల్లి: ఉపాధి కూలీకి స్టీల్ వాటర్ బాటిల్, మజ్జిగ ప్యాకెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

పెనుబల్లి: మండలంలోని లంకపల్లి, శ్రీనివాసపురం, గురవాయిగూడెం, కోండ్రుపాడు, పెనుబల్లి గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కలుసుకున్నారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి సంయుక్తంగా నియోజకవర్గంలోని ఉపాధికూలీల కోసం ఏర్పాటు చేసిన స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను, మజ్జిగ ప్యాకెట్లను కూలీలకు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, పెనుబల్లి సర్పంచ్ తావునాయక్, ఎంపీటీసీ లక్ష్మీకాంత, రైతు సమితి అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి, పంచాయతీరాజ్ ఈఓ వాల్మీకి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు మండలంలో పర్యటన..

కల్లూరురూరల్: మండలంలోని శుక్రవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. ఈ సందర్భంగా బత్తులపల్లిలో ఇటీవల, కప్పల బంధంలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం పలు మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుల రామారావు, వాసు, డీసీసీబీ డైరెక్టర్ లక్ష్మణరావు, మాజీ జెడ్పీటీసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి



గుడిపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీఓ కొండమ్మ, సూపర్‌వైజర్ మహాలక్ష్మి

సత్తుపల్లిటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలలోపు పిల్లలను చేర్పించాలని సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కొండమ్మ సూచించారు. పట్టణంలోని గుడిపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సూపర్‌వైజర్ మహాలక్ష్మితో కలిసి సందర్శించారు. గర్భిణులకు, చిన్నారులకు ఆహారం అందించబడతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శకుంతల, ఆయా జ్యోతి పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

కల్లూరు: ఆర్టీసీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం పంచాయతీ ఆధ్వర్యంలో 700 మందికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. 60 రోజుల మజ్జిగ పంపిణీ ముగింపు సందర్భంగా కల్లూరు బస్టాండ్‌లో ఆమె మాట్లాడారు. ప్రయాణికుల సంక్షేమం కోసం సత్తుపల్లి టీం ఆధ్వర్యంలో కల్లూరులో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. అనంతరం విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, ఈఓ సీహెచ్ కృష్ణారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, బిల్ కలెక్టర్ వెంకటేశ్వరరావు, కొత్తపల్లి వెంకట్, సిబ్బంది మారేశ్వరరావు, వెంకటేష్, మజ్జిగ దాతలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కారేపల్లి: కారేపల్లిలో శ్రీపెద్దమ్మతల్లి ఆలయ 6వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం వేద పండితులు మల్లిఖార్జున శర్మ, నాగసాయి శర్మ, ఆలయ నిర్వాహణ కమిటీ చైర్మన్ మండెపూడి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య పాశుపతహోమం, ఆవాహిత మండప హోమం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం మహాఅన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు.

పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



మధిర: పాఠశాలలో సరస్వతీ పూజ చేస్తున్న విద్యాలత, వెంకటరెడ్డి

మధిర: మధిర పట్టణంలోని భరత్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. భరత్ కిడ్స్, టెక్నో స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా భరత్ విద్యా సంస్థల అధినేతలు శీలం విద్యాలత, వెంకటరెడ్డిలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో సరస్వతీ పూజ చేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రమ్యరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలు, బలపాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, ఉమా, స్రవంతి, నాగరాజు, అజీమ్, గణేష్, భాస్కర్, స్నేహిత, త్రివేణి, రమ్య, శిల్ప, లావణ్య, జ్యోతి, సీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలోని పాఠశాలలో..

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు ఎంఈఓ ప్రభాకర్‌రావు, సర్పంచ్ జంగా పుల్లారెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాసాలు జరిగాయి. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుల్లో బాగా రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంగా గురునాథరెడ్డి, ఉపాధ్యాయులు చిన్నప్ప, శివ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దవాఖానా ఏర్పాటు చేయాలి



డిప్యూటీ డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలో డిప్యూటీ డీఎంహెచ్ఓ రాంబాబు శుక్రవారం పర్యటించారు. ఈ క్రమంలో సర్పంచ్ క్రాంతి, ఉప సర్పంచ్ రామనాథం, గ్రామస్తులు ఆయనకు పల్లె దవాఖానా విషయమై వినతిపత్రం అందించారు. ఇక్కడ దవాఖానా లేకపోవడంతో సకాలంలో వైద్య సేవలకు అందడంలేదని, వైద్యం నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆస్పత్రి గ్రామం నుంచి మండల కేంద్రానికి ఎంతదూరంలో ఉందని, గ్రామ జనాభా ఎంత అని వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి, డీఎస్‌పి హరికృష్ణ, సీనియర్ అసిస్టెంట్ ఉపేందర్, సీహెచ్ఓ దుర్గామల్లేశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న నాయకులు

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలోని జవహర్‌నగర్‌కు చెందిన తన్నీరు ముత్యాలు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సత్తుపల్లి వడ్డెర సంఘం నాయకులు దహన సంస్కారాల నిమిత్తం ఆ కుటుంబానికి రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో గుంజా వెంకటేశ్వరరావు, ఉప్పు హనుమంతు, చల్లా వెంకటేశ్వరరావు, దేవళ్ల శ్రీను పాల్గొన్నారు.

ప్రజాసేవతోనే మానసిక సంతృప్తి

పెనుబల్లి : ప్రజా సేవతోనే మానసిక సంతృప్తి లభిస్తుందని స్టేట్ ఇన్‌కంటాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ అన్నారు. పెనుబల్లి మండలంలోని గంగదేవిపాడులో ఎన్టీఆర్ జిల్లా మైలవరం సబ్ రిజిస్ట్రార్ బానోత్ జగన్ తల్లి లక్ష్మి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి, వితంతువులకు చీరలు, గ్రామస్తులకు కొబ్బరి మొక్కలు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దయానంద్, కార్యదర్శి నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ విజయ్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి బలపరిచిన అభ్యర్థి కొండూరు సుధాకర్ బానోత్ లక్ష్మి విగ్రహానికి పూలమాలలు వేసి, కొబ్బరి మొక్కలు పంపిణీ చేపట్టారు.

జీలుగులు, జనుముల విత్తనాలు పంపిణీ

చింతకాని: మండలంలోని నాగులవంచ సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ నల్ల మోతు శేషగిరిరావు రైతులకు జీలుగులు, జనుముల విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శిరీష

వైరారూరల్: మండలంలో పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటించి ఉపాధిహామీ పనులను పరిశీలించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగన సామాజిక తనిఖీ ప్రజావేదికలో తనిఖీ బృందాలు తమ నివేదికలను ప్రవేశపెట్టారు. పలు గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్త సేకరణ కోసం నిర్మించిన షెడ్డులలో నాణ్యత ప్రమాణాలు లేవని, కొన్ని పంచాయతీల్లో షెడ్లలో శింతటిక్ వాటర్ ట్యాంకులను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. అలాగే స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన పుల్లారావుకి పని ప్రదేశంలో గడ్డపార దిగి గాయపడడంతో అతనికి ఇంకా మెడికల్ బిల్లు చెల్లించని సర్పంచ్ రామారావు, ఉపసర్పంచ్ రామకృష్ణలను అధికారులు నిలదీశారు. అన్ని గ్రామ పంచాయతీల్లో కూడా చేసిన పనుల కంటే ఎంబీ రికార్డుల్లో కొలతలు ఎక్కువ నమోదు చేసిన విషయం ఈ వేదికలో బహిర్గతమైంది. ఎక్కువ మంది సర్పంచ్‌లు ఆసక్తి కనబడచకపోవడంతో ప్రజావేదిక మొక్కుబడిగా సాగింది. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ డి.శిరీష, ఎంపీపీ పావని, క్లస్టర్ ఏపీడీ శ్రీదేవి, వైరా ఎంపీడీఓ శ్రీదేవి, విజిలెన్స్ అధికారి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వాలని ధర్నా



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

సత్తుపల్లిరూరల్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండలంలోని తుంబూరు, సదాశివునిపేట గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన ఇళ్లు లేని పేదలు ఉంటున్నారని, ఒకే కుటుంబంలో రెండు, మూడు కుటుంబాల వారు నివాసం ఉంటున్నారని తెలిపారు. అలాంటి వారికి స్థలాల విషయమై పలుమార్లు సంబంధిత అధికారులు వినతులు అందించినా ఉపయోగం లేదన్నారు. గ్రామాల్లో పలువురు ప్రభుత్వ భూములను ఆక్రమించుకోని సాగు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలకే తప్ప.. ఆచరించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్థలాలతో పాటుగా రూ.5లక్షలు అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తుంబూరు, సదాశివునిపేటకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తు గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: బీసీ కుల వృత్తిదారులకు అందించనున్న రూ.లక్ష ల రుణాల దరఖాస్తు తేదీని పొడిగించాలని తెలంగాణ చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 20తో దరఖాస్తు గడువు ముగుస్తుండడంతో వృత్తి దారులు ఆందోళన చెందుతున్నారు. కుల, ఆదాయం సర్టిఫికెట్ రావడానికి కనీసం వారం రోజులు పడుతుందని, ఇప్పటి వరకు రాష్ట్రంలో కేవలం 10శాతం మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇంకా 90శాతం మంది తహసీల్, ఈ–సేవ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నారని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని గడువు పొడిగించాలన్నారు. ఈ సమస్యపై వృత్తిదారులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ వృత్తిదారులు బింగి వెంకటేశ్వరరావు, కిట్ట వెంకటేశ్వరరావు, బి.రాంబాబు, మంగళ మహారాజ్, రాజయ్య, వడ్ల బ్రహ్మం, పిల్లి బుచ్చాలు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మిషన్ భగీరథ తాగునీరు సరిగా అందడం లేదన్నారు. ఏపీఓ కోటయ్య మాట్లాడుతూ.. మండలంలో 4వేల మందికి పైగా కూలీలు ఎన్ఆర్ ఈజీఎస్ పనులకు వస్తున్నారన్నారు. ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమైనందున పిల్లలను పాఠశాలకు పంపించాలన్నారు. ఎంపీడీఓ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. బీసీ కుల వృత్తిదారులు లక్ష రూపాయల రుణం కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని, వీటిపై పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు రాకపోవటంతో వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ అశోక్, ఏఓ తాజుద్దీన్, ఏపీఎం శ్రీనివాసరావు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.